# టెండర్లు తెరుస్తరా? రద్దు చేస్తరా?

- ముగిసిన కోడిగుడ్ల టెండర్ల గడువు
- జోనల్ సిస్టం రద్దు దిశగా అడుగులు
- డీ సెంట్రలైజ్డ్ పద్ధతి అమలుకు యత్నం
- అనుయాయుల కోసమేనా?



హైదరాబాద్ మే 15 (నమస్తేతెలంగాణ): కంది పప్పు, పామాయిల్, బెంచీల సరఫరా కాంట్రాక్ట్ల తరహాలోనే కోడిగుడ్ల టెండర్లపై నీలినీడలు కమ్ముకున్నాయి. గురువారంతో టెండర్ల దాఖలుకు గడువు ముగిసింది. టెండర్లు తెరిచి తక్కువకు కోట్ చేసిన వారికి అప్పగిస్తారా? లేదంటే జోనల్ సిస్టంలో పిలిచిన టెండర్లను రద్దు చేసి డీ సెంట్రలైజ్డ్ (జిల్లాల వారీగా) విధానాన్ని తీసుకువస్తారా? అనే విషయంపై స్పష్టత రావడంలేదు. విశ్వసనీయ సమాచారం మేరకు పాత టెండర్లను రద్దుచేసి డీ సెంట్రలైజ్డ్ పద్ధతిని తెరపైకి తెచ్చేందుకే కాంగ్రెస్ సర్కారు మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తున్నది. దీని వెనుక దక్షిణ తెలంగాణకు చెందిన అధికార పార్టీ నేత, మాజీ ఎంపీ చక్రం తిప్పినట్టు ప్రచారం జరుగుతున్నది. పౌల్ట్రీ రైతుల ముసుగులో ఉన్న తన అనుయాయులైన కాంట్రాక్టర్లకు అయాచిత లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వ 'పెద్ద'పై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. సదరు నేత సంబంధిత శాఖా మంత్రికి తెలియకుండానే ఈ తతంగం నడిపించినట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో నగదు 'చేతు'లు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మళ్లీ టెండర్ల రద్దుకే మొగ్గు

ప్రభుత్వ పెద్ద తమ అనుయాయులకు మేలు చేసే లక్ష్యంతో జోనల్ సిస్టంను ఎత్తేసి జిల్లా విధానాన్ని తేవాలని నిశ్చయించినట్టు సమాచారం. ఈ క్రమంలో సంబంధిత శాఖ మంత్రికి తెలియకుండానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం సాగుతున్నది. జిల్లాలవారీగా టెండర్లు పిలిస్తే అనుకూలురైన పౌల్ట్రీ కాంట్రాక్టర్లకు లబ్ధి కలుగుతుందనే భావనతోనే డీ సెంట్రలైజ్డ్ పద్ధతి వైపు మొగ్గుచూపుతున్నట్టు చర్చ జరుగుతున్నది. ఒకటి, రెండు రోజుల్లో ఈ ప్రక్రియపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది.

### గడువు రెండుసార్లు పొడిగింపు

రాష్ట్రంలోని 35,700 అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా కోసం మార్చి 30న పాత విధానంలోనే టెండర్లు ఆహ్వానించారు. ఏప్రిల్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మధ్యలో ఎమ్మెల్సీ ఎన్నికలు రావడం, సెలవులు ఎక్కువగా ఉండటంతో గడువును ఏప్రిల్ 15 వరకు పొడిగించారు. అయితే టెండర్ నిబంధనలు పాత పౌల్ట్రీ రైతుల (కాంట్రాక్టర్లు)కు అనుకూలంగా రూపొందించారని వార్తలు రావడంతో రద్దు చేసి నిబంధనల్లో మార్పులు చేశారు. ఇందుకు అనుగుణంగా ఆన్‌లైన్ దరఖాస్తు గడువును మే 15 వరకు పొడిగించారు. అయితే ఆ ఎంపీ ఒత్తిడితో సర్కారు పెద్ద సూచనల మేరకే రూల్స్‌లో మార్పులు చేసినట్టు ప్రచారం సాగుతున్నది. కాగా జోనల్ సిస్టంలో టెండర్లు పిలవడంతో ఆఫీసర్ల పర్యవేక్షణ అధికంగా ఉంటుంది. దీంతో సరాఫరాలో అక్రమాలకు పాల్పడే అవకాశం ఉండదని భావించిన సదరు నేత కొంత ఆలస్యంగా మేలుకొని పాత పద్ధతిని రద్దు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తున్నది.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క

హైదరాబాద్ మే 15 (నమస్తే తెలంగాణ): వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని అంగన్‌వాడీ సెంటర్లల్లో అన్ని వసతులు కల్పించాలని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ జిల్లాల సంక్షేమశాఖ అధికారులు(డీడబ్ల్యూవో)లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడేండ్ల నుంచి ఆరేండ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లలో చేర్పించాలని ఆమె సూచించారు. 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' అనే నినాదంతో అవగాహన, ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సరైన సౌకర్యాలు లేని భవనాలను సమీపంలోని పాఠశాలలు, ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని ఆమె పేర్కొన్నారు. తాగునీటి, టాయ్‌లెట్ సౌకర్యాలు లేనిచోట్ల వెంటనే చర్యలు వసతులు కల్పించాలని తెలిపారు. 85 అంగన్‌వాడీ సెంటర్లకు పక్కా భవనాలు నిర్మించాలని సంకల్పించామని సీతక్క పేర్కొన్నారు.

## కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌లో
# కన్నాయిగూడెం వాసి మృతి

కన్నాయిగూడెం, మే 15 : తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న కర్రెగుట్టల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలానికి చెందిన మావోయిస్టు నేత సాదపల్లి చందూ అలియాస్ రవి(25) మృతి చెందాడు. ఏటూరు గ్రామానికి చెందిన అన్నపూర్ణ-వెంకటేశ్వర్లు (తండ్రి లేట్) దంపతులకు రాజు, చందు ఉన్నారు. ఇంటర్ వరకు చదివిన చందు భద్రాచలంలోని ఓ వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న సమయంలో మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై రెండు సంవత్సరాల క్రితం మావోయిస్టు పార్టీలో చేరాడు. బెటాలియన్ డాక్టర్ టీమ్ కమాండర్‌గా, కేంద్ర కమిటీ సభ్యుడు దామోదర్‌కు అత్యంత సమీపంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తున్నది. చందుపై రూ.8లక్షల రివార్డు ఉన్నట్టు సమాచారం. కర్రెగుట్టల ప్రాంతంలో ఈ నెల 6,7 తేదీల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో చందు మృతి చెందాడు. ఈ విషయం తెలియక మృతదేహం కోసం ఎవరూ వెళ్లకపోవడంతో పోలీసులు భద్రపర్చి ఉంచారు. చందు మృతి వార్త గ్రామాన్ని విషాదంలో ముంచింది. గురువారం కుటుంబ సభ్యులు చందు మృతదేహాన్ని ఏటూరుకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు




## గూగుల్‌తో సీఎస్‌బీ కీలక ఒప్పందం

సీఎస్‌బీ డైరెక్టర్ డీజీ శిఖాగోయెల్ వెల్లడి



హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) గురువారం గూగుల్‌తో మూడేండ్లపాటు కొనసాగే కీలక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నట్టు సీఎస్‌బీ డైరెక్టర్ డీజీ శిఖాగోయెల్ తెలిపారు. రాష్ట్ర పోలీస్ వ్యవస్థలో సైబర్ భద్రతను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ఎంఓయూ కుదుర్చుకున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో గూగుల్ తన క్లౌడ్ ఆధారిత సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (ఎస్‌వోసీ)ను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కోసం అమలు చేయనున్నదని ఆమె వివరించారు. ఈ సేవలను గూగుల్ క్లౌడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుబంధ సంస్థ అయిన ఇలోయిస్ డిజిటల్ ద్వారా సీఎస్‌బీకి ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఈ సేవల ద్వారా మెరుగ్గా సైబర్ నేరాలను నివారించవచ్చునని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజలకు నిరంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌బీ ఎస్పీ హర్షవర్ధన్, ఇలోయిస్ డిజిటల్ డైరెక్టర్ ముత్తుస్వామి ధరణిధరన్, ఆరేట్ ఐఆర్ ఎల్ఎల్‌పీ సీనియర్, వైస్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ పేష్కర్, గూగుల్ సెక్యూరిటీ బిజినెస్ హెడ్ జ్యోతి ప్రకాశ్, సెంటినెల్ వన్ ఇండియా స్టాఫ్ సొల్యూషన్స్ ఇంజినీర్ శశిధర్ వెల్లంచేటి తదితరులు పాల్గొన్నారు.

## 18న సింగరేణి ఆధ్వర్యంలో జాబ్ మేళా

100 కంపెనీలు.. 3 వేల ఉద్యోగావకాశాలు : సీఎండీ బలరాం

హైదరాబాద్ మే 15 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 18న(ఆదివారం) మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నామని సీఎండీ ఎన్ బలరామ్ గురువారం వెల్లడించారు. 100 కంపెనీలు పాల్గొని మూడు వేలమందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో మందమర్రి, రామగుండం-1, భూపాలపల్లి ఏరియాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ప్రారంభించామని, త్వరలోని మిగిలిన ఏరియాల్లోనూ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

## డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల దరఖాస్తు పొడిగింపు

ఎంజేపీ బీసీ సొసైటీ కార్యదర్శి సైదులు

హైదరాబాద్, మే15 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు విధించిన గడువును 20వ తేదీ వరకు పొడిగించారు. సొసైటీ కార్యదర్శి సైదులు గురువారం ప్రకటనలో వెల్లడించారు. రెగ్యులర్ కోర్సులతోపాటు ఫైన్ ఆర్ట్స్, యానిమేషన్ తదితర వృత్తి విద్య కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా mjptbcwreis.telangana.gov.in లేదా tgrdccet. cgg. gov.in/TGRDCWEB లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీసీ గురుకులాల్లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, సదరు గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్ 040-23328266లో సంప్రదించాలని కార్యదర్శి సూచించారు.

## కోల్‌బెల్ట్‌లో 'కొలువుల దందా'

దళారుల గుండెల్లో గుబులు ● అయోమయంలో బాధితులు

జయశంకర్ భూపాలపల్లి, మే 15 (నమస్తే తెలంగాణ): 'కొలువుల దందాలో కోటికి స్కెచ్' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం భూపాలపల్లి కోల్‌బెల్ట్ ఏరియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. సమారు 30 మంది నిరుద్యోగుల నుంచి రూ.3లక్షల చొప్పున వసూలు చేసిన దళారులకు 'నమస్తే కథనం' గుబులు పుట్టిస్తున్నది. ప్రైవేటు సెక్యూరిటీ గార్డు ఉద్యోగాల కోసం రెండు రోజుల క్రితం కొత్తగా టెండర్ ఓపెన్ కాగా అందులో 27 మందిని చేర్చుకోనున్నారు. ఈ మేరకు దళారులు రంగ ప్రవేశం చేసి 30 మంది బయోడేటా, డబ్బులు తీసుకొని సెక్యూరిటీ గార్డు ఉద్యోగం ఇప్పించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. కార్మిక సంఘం నాయకులు ఈ దందాలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం కాగా సింగరేణి అధికారులు దీనిపై ఓ కన్నేశారు. గతంలో ఇక్కడ పనిచేసి వెళ్లిన ఇద్దరు జీఎంలు తమను సెక్యూరిటీ గార్డు ఉద్యోగాల కోసం ఎంపిక చేసి మెడికల్, వీటీసీ చేయించారని, కొత్తగా వచ్చిన 27 పోస్టుల్లోకి తీసుకోవాలని కొంతమంది డిమాండ్ చేస్తున్నారు.

## ఆరున్నర కోట్ల ఫ్రాడ్ కేసులో మీడియా ప్రతినిధి

14 రోజుల రిమాండ్‌కు తరలింపు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మే 15 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరో నిందితుడుగా ఉన్న ఓ మీడియా సంస్థ ప్రతినిధి శ్రావణ్‌కుమార్‌పై చీటింగ్ కేసు నమోదైంది. ఈ కేసు రిమాండ్ రిపోర్టులో అధికారులు కీలక అంశాలను వెల్లడించారు. రూ. 6,58,47,883.81 డబ్బును ఆఖండ్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియాకు చెల్లించకుండా, ఇనుప ఖనిజాన్ని కూడా ఇవ్వకుండా తమ కంపెనీని శ్రావణ్ మోసం చేశాడని ఏ ఆకర్ష్‌కృష్ణ సీసీఎస్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ కేసులో శ్రావణ్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరుపర్చగా 14 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తూ 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ కేసులో ఉన్న మిగతా నిందితులు అకోర్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధి కేబీ వేదమూర్తి, శ్రావణ్ భార్య అరువేల స్వాతి, అకోర్ ఇన్‌రిథమ్ ఎనర్జీ కంపెనీలకు చెందిన వ్యక్తులు పరారీలో ఉన్నట్టు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. త్వరలో వారిని కూడా అదుపులోకి తీసుకోనున్నట్టు పోలీసులు వివరించారు. ఆర్థిక నేరాల్ని తీవ్రంగా పరిగణించాలని, నిందితుడు సాక్షులను ప్రభావితం చేసే అవకాశాలు మెండుగా ఉంటాయని అధికారులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.













